# ౨ శ్రీరంగ పట్టణపు నడువీధి పెరుమాళ్ళస్తంభము

ఆ స్తంభ మెత్తవలసిన స్తంభమే కాని ఎక్కవలసిన స్తంభము గాదు. దానిపేరు పెరుమాళ్ళ స్తంభము. ప్రత్యేకంగా ఒంటిగా నడు వీధిలో నాల్గుసందుల మొగను అది నెలకొల్పబడింది. ఇత్తడిరేకుది. చుట్టూ గచ్చు అరుగుగలది. దాని యెట్ట యెదుట చిన్నరాతి విగ్రహ ముంది. ఆరు బయటనే అన్నీ - వేఱే గుడి, వేఱే గోపురం, వేఱేపూజా నమస్కారం, వేఱే ఆస్కారం, అధ్వర్యం, అర్చనం, ఏమిలేవు. కాని సూర్యకాంతి అనివార్యంగా దానిమీద ప్రకాశిస్తూ వుంటుంది. వెన్నెల అచ్చంగా దాన్ని మెఱయిస్తూ వుంటుంది. మేఘం దాన్నొరసి పోతూ వర్షిస్తుంది. మఱి ఆ స్తంభం యొక్క మొనమీద మంచు చుక్కపడి ఆ మంచు చుక్కలో వేగు చుక్క కాంతి ప్రతిఫలించి పోతూవుంటుంది. ఆ సమయమప్పుడు ఆ కాంతిని మీరంతా ముక్కుకు కట్టిన ముత్యం అనాలి! లేక ఎక్కడ లేని సత్యం అనాలి! దాని పునాదిలో పడవైచినవి రాగి దమ్మిడీల నుండి వజ్రాలవఱకు, దాని మీదెగిరిపోయేవి తిత్తిరిపోతం నుండి గరుడపక్షివఱకు.

దాని యొక్క అతీతమైన ఆనందం నేనెప్పుడు పొందకలిగి యున్నానూ అంటే, చిన్నప్పుడెప్పుడో ఆ స్తంభం చుట్టూవున్న అరుగెక్కి

ఆ స్తంభాన్నే నాకుడి చెవి మోపి, నారెండు అరచేతులా ఆ యిత్తడి రేకు పైని ధ్వనిచేస్తూ విన్నప్పుడు. ఏమైనా అర్ధమైందా నీకాధ్వనివల్ల, ఇంకా మఱచిపోకుండా జ్ఞాపక ముంచుకున్నావు అంటే అర్ధంకోసమై నేధ్వని చేస్తేగా? ఆనందంకోసమైచేశాను. ఎవరికైనా అర్ధంతెలుసుకోవాలనివుంటే ఆ ధ్వనిలోగాదు, ఆ ధ్వనివింటూ నేను పొందిన నాఆనందంలో అర్ధం వెతుక్కోండి అని చెప్తాను. ధ్వనిలో అర్ధంకోసం తంటాలు పడకండి అని హెచ్చరిస్తా.

మఱొహటి. ఆ చిన్నప్పుడర్ధం లేకుండా ఆలాచేసిన చేతి చప్పుళ్ళు లాంటివిగానే యిప్పుడు కూడా నేను వ్రాస్తువుండడం అని గ్రహించండి. ఏమో పెద్దదిగినాక పెద్దపెద్ద సంగతుల్లో పడ్డానని మహాసమస్యలల్లే అడగబొయ్యేరుగనుక—మన జీవితాల కల్లాంటివిలేవు. ఆలాంటివి గలవని యూహించడం వెఱ్ఱి. అడక్కండి. నా వ్రాతనూ నన్నూ వేరుచేయకండి. వ్రాస్తూన్నప్పుడు నా చేతి వ్రాలేలా వెడుతూ నాకు చిదానందం కలిగిస్తుంటుందో ఆపరిపూర్ణ స్వభావాన్ని గమనించండి.

మా బామ్మపోయిన మైల రోజుల్లో ఒకనాటి రాత్రి, నేనూ, మా సూరన్న కక్కయ్య, మా భాస్కర్రామయ్య మామ (మేనత్త పెనిమిటి), ముగ్గురం మా అరుగుమీద మా ఊళ్లో పిచ్చాపాటీ ఆడుకుంటూ కూర్చున్నాం. పోయిన ఆవిడ ముసిలి తొంభై తొమ్మిదేళ్లు కడచిన వరుగు. ఆవిణ్ణి గురించి విచారపడ్డం అనేది మనకలౌకికమే కాకుండా అవిడ ఆముష్మికానిక్కూడా ఆటంకమేమో? అయినా మమ్మల్ని చిన్నప్పుడు పెంచిన కారణంచేత నేనూ, కన్నతల్లి అవడం చేత మా పినతండ్రి మేనత్తా, యిలాగ్గా కొందఱు కొందఱు రక్తస్పర్శ

కొద్దీ, అశ్రుబిందు వొకటి వదలి, ఆవిణ్ణి గురించి ఆ వెంటనే ఏదో గాథగా చెప్పుకోవడం ఆ పది పన్రెండు రోజులూ రివాజై పోయింది. ఊళ్ళో తతిమ్మా జనం అంతా బహూ ఆనందంగా వుండే సంక్రాంతి పర్వదినాలవి. ఏమూల చూచినా ముష్టికి నష్టికికూడా బాజాభజంత్రీల సమేతంగా వచ్చి అడుక్కోవడమే. అంచేత ఆనాటిరాత్రి మా సంభాషణ యావత్తూ ఆ మధ్యాహ్నం "వినిపించిన డప్పుల వాయిద్యం మీదికి పోయింది. ఆ డప్పుల వాయిద్యం నుండి కారెం తమ్మన్న పితూరీ కథకు నడిచింది. ఆ పితూరీ కథలో పిల్ల కథగా మా బామ్మ పేరో కించిత్తు ప్రమోసింది.

"లిల్లేలా లిల్లేలా రామారామా లిల్లేలా !
అరుంధ తమ్మా మాయింటి పడుచు
వసిష్టు అన్న మా కల్లుండు
లిల్లేలా లిల్లేలా రామా రామా లిల్లేలా"

అని పాడుతూ మాదిగ లా మధ్యాహ్నం, ధాన్యం పట్టుకు పోడానికో కావడి వేసికొని, ఒక లిల్లేల కత్తి మోసికొని వచ్చినారు. ఒకడు చుట్టు చెంగాని తలపాగ చుట్టి తెల్ల పంచె కట్టాడు. మఱొకడు ఎఱ్ఱ తలపాగ చుట్టి పొట్టి తెల్ల చొక్కా తొడిగాడు. చిన్న డప్పు లుచ్చుకు పైపులు మాఱుతూ మోకాళ్ళ నొంగుంటూ రకరకాల వాయిద్యాలు వాయించేరు. పల్లకీ ముందు డప్పు, నిశానీడప్పు, పీర్ల డప్పు, చాటింపు డప్పు, గవడప్పు, కోలాటండప్పు, ఒకటేమిటి ! వాళ్ళు వెళ్ళిపోయినారు వాళ్ళ మామూలు గింజలు తీసికొని — మా మనస్సుల్లో మిగిలింది ఆ డప్పులుచ్చుకు వాళ్ళు వాయించినవడుపు. ఆరాత్రి మేము యోచించింది ఆ వాళ్ళ ఆనందం.

"అయినా ముష్టి కోసం వచ్చి వాయించినారనే యొకానొక తీసి కట్టు అందులో వుండిపోయింది" అన్నాను నేను. "అలాగైతే విను ముష్టికి నష్టికి కాకుండా జబ్బపుష్టి కొద్దీ డప్పు వాయించి ఊరందర్నీ హడల్ కొట్టించిన ఒక గాథ చెబుతాను" అన్నాడు మా పినతండ్రి. మా భాస్కరరామయ్య మామ ఊఁ కొట్టడం ప్రారంభించాడు. వీధిగోడ గూటిలో ఆముదం దీపం చలన కాంతిని ఆశ్చర్యంగా చూస్తూ తానుకూడ తలూపు తూన్నట్లుంది.

"ఇప్పుడు మనం 'దండుపుంత' అని పిలుస్తాం! ఇసుక పుంత! ఊరి కుత్తరంగా 'తమ్ముడు' చెర్లోకున్నపుంత! – దాని కాపేరెలావచ్చిందీ అంటే ఆ పుంతంట దండొచ్చిందట! పితూరీదండు! రంపపితూరీ దండు!– ఆ పితూరీకి మొనగాడు కారెంతమ్మన్న. అతగాడు మన్యంలోంచి హఠాత్తుగావచ్చి ఊళ్ళకూళ్ళు దోచుకుంటూ వున్నాడని దేశమంతా గగ్గోలుగా చెప్పికోవడం మనూరు వాళ్ళకు తెలిసింది. అప్పటికి మనవూరింతలేదు. ఈ పాత యూరు మట్టుకు వంద కొంపవుండేది. కాప జనం వుచ్ఛస్థితిలో వుండేవారు కాస్త పచ్చపచ్చగా. ఊరికి దక్షిణంగావున్న కాప వరపు చెరువుమేట్ట, జిల్లేళ్ళదుబ్బులుతోటి, బ్రహ్మదండి పొదలతోటి కికారణ్యంగా ఉండేది."

"కారెంతమ్మన్న ఇగ మనపూరి మీద పడిపోతాడని పుకారు. అయితే ఏంచేస్తారు? ఊళ్లోవాళ్లేం చేయగలరు? ఒక వెయ్యిమంది కోయ వాళ్ళతోటి, కొండవాళ్ళతోటి మిడతల దండల్లే పడిపోవడం, వున్నలొద్దు లొస్కు పట్టుకుపోవడం, అలాచేస్తూ వున్నాడని వినికి. ఆ వినికినిబట్టి భీతాంగం. ఇలావుంటే ఊళ్లోవాళ్ళంతా ఓపన్నాగం పన్నారు.

ఒక మాదిగవాణ్ణి ఒక డప్పుచ్చుకు— ఆ రోజుల్లో పెద్ద డప్పులే గాని చిన్న డప్పుల్లేవు — ఒక పెద్ద డప్పుచ్చుకు తమ్ముడు చెరువుగట్టు మీద కాపలా కాయమన్నారు. ఆలా ఉత్తరాది కేసి చూస్తూండమన్నారు. మైలుదూరంలో ఇసుక రేగడం పితూరీజనం రావడం కనబడగానే డప్పుచ్చుకు ధమ ధమా వాయించమన్నారు. ఆ డప్పు వినబడగానే ఎవరికి వాళ్ళు సాధ్యమైనంత సాధన సామాగ్రి చంక బెట్టుకొని కాపారపు చెర్లోకి పారిపోయి కనబడకుండా దాక్కుందా మని వారి యూహ. సరే— మాదిగవాడు డప్పుచ్చుకు గట్టు మీద కూర్చున్నాడు. పొద్దున్న గడియ పొద్దెక్కిన కాడనుంచి కూడుకూడా గట్టుమీదే తిని కనిపెట్టుకు చూస్తూ వున్నాడు. ఆలా చూస్తూండగనే వానికి కునుకట్టిపోయింది. పొద్దు కొంచెం పడమటికి వాలింది. ఆ కునుకల్లా గాఢనిద్రలోకి దిగింది. వాని పక్కనే డప్పు ఎండలో వేడే కాపడం అక్కఅలేకుండా కాగుతూవుంది. చీపురుపుల్ల పుచ్చుకొ్కడితే చెవులు చిల్లులు పడేటంత చప్పుడు చేసే టట్టుగా కాగివుంది, ఆ డప్పు, దారిలో.

"పొరుగూరువెళ్ళి, ఈ యూర గడబిడ ఏమీ యెఱుగని కోనాల గంగన్న అనే కాపతడు — అతని కేఖై యేళ్ళుంటాయి. — అతను ''రాఘోపురం'' మీదుగా వస్తూ ఆ గట్టుమీద ఆ డప్పు చూచాడు. ఆ డప్పు పక్కనే మాదిగవాడు గుర్రెడుతూ నిదరోవడం కనిపెట్టాడు. "ఈడి తస్సాగొయ్య ! నిదరోతున్నాడు ! మనకు సరదాతీర ఈ డప్పుచ్చుకు వాయించి వీణ్ణి లేపాలి" అని ఆ డప్పు తన యెడం చంకను తగిలించుకొని, చిఱుత కుడిచేత పుచ్చుకొని, వెదురుపుల్ల ఎడంచేత పుచ్చుకొని, అదే వాయించడం ! అదే వాయించడం !

"ఊళ్లో వున్న జనం, ఆ పడుకున్న మాదిగ సమేతంగా కాపారపు చెర్లోకి, మంచాల తోటి, కుంచాల తోటి, కంచాల తోటి, కావళ్ళ తోటి, గోతాల తోటి, ఛేంత్రాళ్ళ తోటి, ముంతల తోటి, దొంతల తోటి, ఒకటే పరుగు, ఒకటే పరుగు — ఊళ్లో ఒక్క పిట్టుంటే ఒట్టు.

అప్పుడు మా అమ్మ పురుడోసుకుని పురిటిగదిలో వుందట. నేను చంటి పిల్లవాణ్ణట. మమ్మల్నిద్దర్ని ఆ పురిటిగదిలో వదలిపెట్టి ఈ యింటిల్లిపాదీకూడా పోయినారట దక్షిణంగా బయలు మీద ఆరుప్పు అరొంబ్బ చాటునా మాటునా దాక్కోడానికై. మఱికొంత సేపటికి మాదిగాడి డప్పు గంగన్న కాపుచ్చుకుని వాయించాడని ఎలాగో తెలిసింది. గంగన్నే వచ్చి చెప్పివుంటాడు. "ఏంటర్రా! ఆలా పోయేరు! రాండర్రా! నా వాయిద్యం బాగుండ లేదంటర్రా!'" అని.

రాత్రికి మళ్ళా అంతా ఊళ్లోకి జేరుకున్నారు.

"ఆ డప్పు వాయిద్యం లాంటి వాయిద్యం కావాలంటావు నీవు?" అన్నాడు మా పినతండ్రి. "ఆలాంటిది కాదు" అన్నాను నేను. "గంగన్న డప్పును తన సరదాకొద్దీ వాయించినమాట వాస్తవమే. ముష్టికీ నష్టికీ వాయించలేదు. కాని అదో బెదరు పెట్టింది. జనంలో అమ్మబాబో ఆలాంటి హడల్ పదివేల జన్మాలకూ వద్దు. బామ్మ పురిటింట్లో అప్పు డెంత బిక్కుబిక్కుమని వుండిపోయి వుంటుంది అంటావు! నిన్నేం చేసి పోతారో అని ఎంత యిదై పోయి వుంటుంది అంటావు!" అన్నాను.

మా పినతండ్రి అంత వుత్సాహంగా కథ చెప్పినవాడూ పెదవులు కదపలే. ఒక్కంట నీటిబొట్టు కూడా ఆవిణ్ని తల్చుకుంటూ వదలి వుంటాడు. ఆతని చేయి ఆలా కన్ను తుడిచి విడిపి నట్లైంది. మా

మేనత్త పెనిమిటి "తల్లి యొక్క త్యాగంతో సమానమైన త్యాగం మరొకటి కానం. ఇంటిల్లిపాదీ వెళ్ళగలిగారు గాని ఆ యిల్లాలు నిన్ను విడిచిపెట్టి వెళ్ళగలిగిందా ?" అని తిరిగి మాటల్లోకి దింపాడు.

"ఎందుకూ? కొన్నాళ్ళదాకా పెరుమాళ్ళ స్తంభం అరుగు మీద కెక్కి కుఱ్ఱాళ్ళు స్తంభం రేకుమీద చప్పుడు చేయబోతే చప్పుడు చేయనిచ్చేవారు కారు. ప్రజల బెదురలా ఉండేది" అన్నాడు మా పినతండ్రి.

"ఓ ! ఈ స్తంభానికి ధ్వని లేని రోజులు కూడా ఉన్నాయి ? నేను నిరాఘాటంగా చప్పుడు గొలిపిన దీనికి — దీనికి చప్పుడు లేని రోజు లున్నాయా" అన పైని తొల్త వివరించిన నా స్వయం వ్యక్తి చిదానంద స్వరూపాన్ని విస్మరించినాను. నా స్వయంవ్యక్తి చిదానంద స్వరూపాన్ని విస్మరించగా గోచరించింది, నిశ్శబ్దవంతమైన ఆ పెరుమాళ్ళ స్తంభం.

—:o:—

| రచన | స్ఫురణ | తొలి ప్రకటనము |
|---|---|---|
| 27—6—1931 | శ్రీరంగ పట్టణము | "సుధ" లో |